www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 14 ఏప్రిల్ 2025
5
అన్నమయ్య

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి రాయచోటి టౌన్

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. ఆదివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుంగనూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన రెండు గ్రూపులపై దాడి చేసి గాయపరిచిన విషయంలో సామజిక మధ్యమాలలో వైరల్ అవుతున్న విషయాన్నీ గమనించి ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి గొడవలు సృష్టించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. జిల్లాలో ప్రజలు, రైతులు భూమి సమస్యలు ఉంటే వాటిని చట్టబద్ధంగా న్యాయపరంగా సంబంధిత అధికారుల నుండి సమస్యను పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. వ్యక్తిగత కక్షలు పెంచుకొని వర్గాలు గ్రూపులుగా ఏర్పడి గొడవలు పడి ప్రజాశాంతికి విఘాతం కలిగించే విధంగా ఘర్షణకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటి వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. వీలైతే రౌడీ షీట్లు కూడా ఓపెన్ చేసి ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తంబళ్లపల్లె టిడిపిలో భగ్గుమన్న విభేదాలు

- మంత్రి సమక్షంలో తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ
- శంకర్, జయచంద్రారెడ్డి గ్రూపుల మధ్య ఘర్షణ
- హార్సిలీహిల్స్‌లో తీవ్ర ఉద్రిక్తత
- లాఠీఛార్జి చేసిన పోలీసులు
- సమీక్ష సమావేశం నుంచి వెళ్లిపోయిన మంత్రి

గొడవపడుతున్న వారిని చెదరగొడుతున్న పోలీసులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తంబళ్లపల్లె తెలుగుదేశం పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. ఎక్కడైనా ప్రత్యర్థి పార్టీ నాయకత్వం నాయకులు, కార్యకర్తలు గొడవ పడడం సర్వసాధారణం. తంబళ్లపల్లి నియోజకవర్గంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఆదివారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బి.సి.జనార్ధన్‌రెడ్డి సమక్షంలోనే టిడిపి నాయకులు తీవ్ర స్థాయిలో గొడవపడ్డారు. హార్సిలీహిల్స్‌లో నిర్వహించిన తంబళ్లపల్లి నియోజకవర్గ స్థాయి తెలుగుదేశం పార్టీ సమావేశం రసాభాసగా మారింది. మంత్రి జనార్దన్‌రెడ్డి ఎదుటే కార్యకర్తలు రెండు గ్రూపులుగా విడిపోయి బాహాబాహీకి దిగారు. తంబళ్లపల్లె నియోజకవర్గం ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన జయచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే శంకర్ మధ్య రాజకీయ గ్రూపు పోరు తార స్థాయికి చేరడంతో వారి అనుచరులు ఘర్షణకు దిగారు. నిజమైన పార్టీ కార్యకర్తలకు న్యాయం చేయాలని శంకర్ అనుచరులు నినాదాలు చేశారు. వైసిపి నుంచి వచ్చిన వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తున్నారని పార్టీకి పని చేసిన వారికి కనీస మర్యాద దక్కలేదని వాపోయారు. రెండు గ్రూపుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఘర్షణలో పిటిఎం మండలం మాజీ జడ్‌పిటిసిపై దాడి జరిగింది. పోలీసుల జోక్యం చేసుకొని గొడవ సద్దుమణిగేందుకు ప్రయత్నించారు. సమావేశం రసాభాసగా మారడంతో మంత్రి జనార్దన్‌రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్‌రాజు సమీక్షను అర్థాంతరంగా ముగించారు. వివరాలలోకి వెళితే... కార్యకర్తలతో మండలాల వారీగా మంత్రి జనార్దన్‌రెడ్డి సమావేశం నిర్వహిస్తుండగానే బయట మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ వర్గీయులు, జయచంద్రారెడ్డి వర్గీయులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బాహాబాహీకి దిగడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఒకరినొకరు కొట్టుకునే పరిస్థితి ఏర్పడింది. అనంతరం పూర్తిస్థాయి సమావేశం నిర్వహించకుండానేమంత్రి జనార్దన్‌రెడ్డి, సీడ్ యాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రాజు వెనుదిరిగిపోయారు. మంత్రి సమావేశం నుంచి అర్థంతరంగా వెళ్లిపోవడంతో కోపోద్రిక్తులైన టిడిపి శ్రేణులు ఓవైపు శంకర్ గ్రూపు, మరోవైపు జయచంద్రారెడ్డి గ్రూపు దాడులకు తెగబడడంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. హుటాహుటిన పోలీసులు రంగ ప్రవేశం చేసి రెండు గ్రూపులను చెదరగొట్టడంతో పరిస్థితి సద్దుమణిగింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు లాఠీఛార్జి చేశారు. త్వరలోనే మండలాల వారీగా ప్రతి కార్యకర్తకు సమాచారం ఇచ్చి సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంత్రి ఎదుటే తెలుగు తమ్ముళ్లు తన్నులాడుకోవడం నియోజకవర్గంలో పార్టీ ప్రతిష్ట మంట కలిసే పరిస్థితి ఏర్పడిందని సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కోవర్ట్‌గా వ్యవహరిస్తున్న టిడిపి ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి మాకొద్దంటూ తెలుగు తమ్ముళ్లు నినాదాలు చేశారు. ఈ పరిస్థితులు గమనించిన మంత్రి మదనపల్లి పర్యటనను సైతం వాయిదా వేసుకున్నారు. టిడిపి అధిష్టానం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ బాబు తంబళ్లపల్లి నియోజకవర్గంపై దృష్టి సారించకపోతే పార్టీ మనుగడ కోల్పోయే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**మీడియాపై దురుసు ప్రవర్తన :** జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పర్యటన నిమిత్తం కాలేజీకి వెళ్లిన మీడియా వారిపై జయచంద్రారెడ్డికి వర్గానికి చెందిన ప్రతాప్‌రెడ్డి దురుసుగా ప్రవర్తించారు. బి.కొత్తకోట పట్టణంలో రెండు గ్రూపులను చిత్రీకరిస్తున్న మీడియా వారిపై దురుసుగా ప్రవర్తించడంపై పలువురు పాత్రికేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా వారిపై అసభ్యకరమైన పదజాలంతో దూషించి ప్రతాపరెడ్డి, జయచంద్రారెడ్డి గ్రూపునకు చెందిన వారు దాడికి తెగబడడం ప్రజాస్వామ్యానికి మాయనిమచ్చ.

# మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**

నూతనంగా నిర్మించిన మసీదును ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి విశేష కృషి చేస్తుందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గువ్వలచెరువులో నూతనంగా నిర్మించిన మసీదును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం మైనార్టీలకు అనేక పథకాలు అమలు చేసి వారి సంక్షేమానికి కృషి చేసిందన్నారు. రాయచోటి నియోజకవర్గంలో ఎక్కువ మంది మైనార్టీలు ఉన్నారని వీరికి ప్రభుత్వం కల్పించిన పథకాలన్నీ అర్హులందరికీ అందేటట్లు చూస్తామని తెలిపారు. అర్హులైన మైనార్టీలందరికీ ఇళ్లు, పెన్షన్లు, తదితర ప్రభుత్వ పథకాలన్నీ అందజేసి వారి అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. మసీదు ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత మెగావైద్య శిబిరంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించిన డాక్టర్లను మంత్రి సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని మైనార్టీ సోదరులు, మంత్రిని గజమాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం మత పెద్దలు, టిడిపి నాయకులు, బాలిసెట్టి చంద్రమౌళి, రేఖం ఆంజనేయులు బ్రదర్స్ చెన్న కృష్ణారెడ్డి, ఇలియాజ్ హరి ప్రసాద్, ఈశ్వరయ్య, సుధాకర్, ఆజాం, తిమ్మారెడ్డి ధనుంజయ, దర్బార్, అరిఫ్, సర్ఫరాజ్, నాగరాజు, వెంకటరామిరెడ్డి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

### అభివృద్ధితో రాయచోటి రూపురేఖలు మారుస్తాం

**చిన్నమండెం :** రాయచోటి నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి పట్టణ రూపురేఖలు మారుస్తామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బోరెడ్డి గారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోని రాయచోటి నియోజకవర్గం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, మంచినీటి సమస్య పరిష్కరించడం, డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు, తదితర అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసి నియోజకవర్గ రూపురేకులు మార్చడం జరుగుతోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కేవలం 9 నెలల కాలంలోనే ప్రాధాన్యత క్రమంలో అవసరమైన గ్రామాలలో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేసి గ్రామాలను అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. నీటి సమస్యతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వివిధ గ్రామాలలో నూతన బోర్లు వేసి మోటార్ బిగించి గ్రామాలకు నీరు విడుదల చేస్తున్నామని తెలిపారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నిరంతరం గ్రామాలలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే బాధితుల సమస్యలు పరిష్కరించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించడం జరిగింది.

### క్రికెట్ అకాడమీ ప్రారంభోత్సవానికి మంత్రికి ఆహ్వానం

**రాయచోటి :** రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఆదివారం రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఈనెల 23వ తేదీ విభా క్రికెట్ స్పోర్ట్స్ అకాడమీని తమ చేతుల మీదుగా ప్రారంభించాలని ఆదివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో విభా క్రికెట్ స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేయడం ఎంతో శుభ పరిణామమని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి తప్పకుండా హాజరవుతానని క్రికెట్ స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులకు మంత్రి తెలిపారు.

### నూతన బోరును ప్రారంభించిన మంత్రి

**సంబేపల్లి :** రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం సంబేపల్లి మండలం, సుద్దలవాండ్లపల్లె గ్రామంలో నీటి సమస్య పరిష్కరించేందుకు నూతన బోరును ప్రారంభించారు. అనంతరం మంత్రి టిడిపి సభ్యత్వం పొందిన అభ్యర్థులకు టిడిపి సభ్యత్వ నమోదు కార్డులు పంపిణీ చేశారు. జగన్నాథం ఆహ్వానం మేరకు మంత్రి ఆయన ఇంటిలో విందు భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంబేపల్లి మండల ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు మంత్రి ఘనంగా ఆత్మీయ స్వాగతం పలికి శాలువా గజమాలతో ఘనంగా సన్మానించారు.

## అశ్వవాహనంపై శ్రీకోదండరాముడు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజైన ఆదివారం ఆదివారం రాత్రి ఏడు గంటలకు అశ్వవాహనంపై స్వామివారు దర్శనమిచ్చారు. ఉదయం కాళీయమర్దనాలంకారంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు స్వామివారి వాహన సేవ వైభవంగా జరిగింది. భజన బృందాలు భజనలు, కోలాటాలు ఆడుతుండగా స్వామివారు పురవీధుల్లో విహరించారు. వాహనసేవ అనంతరం ఉదయం 11 గంటలకు స్నపన తిరుమంజనం వేడుకగా ప్రారంభమైంది. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనంతో శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరాములవారి ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకం చేశారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు అశ్వవాహనంపై స్వామివారు దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఇఒ నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, భక్తులు పాల్గొన్నారు.

**నేడు చక్రస్నానం :** శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు సోమవారం ఉదయం 9 నుండి 10.30 గంటల వరకు చక్రస్నానం వైభవంగా జరుగనుంది. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

**రేపు పుష్పయాగం :** శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో 10వ రోజు మంగళవారం సాయంత్రం 6 నుండి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహించనున్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక తాత్కాలిక రద్దు

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 14న బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా, సోమవారం జరగబోయే ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి స్పందన ఫిర్యాదులను సమర్పించేందు జిల్లా కలెక్టరేట్‌కు రావద్దని ఆ ప్రకటనలో తెలిపారు.

## క్రీడా పోటీల్లో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మిట్స్ కళాశాల విద్యార్థులు జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ అనంతపురం నిర్వహించిన 13వ జెఎన్‌టియు అనంతపూర్ ఇంటర్-కాలేజియేట్ గేమ్స్‌లో విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనపరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. త్రోబాల్ (మహిళలు) విజేతలుగా 1వ స్థానం, బ్యాడ్మింటన్ (పురుషులు-సింగిల్స్) విజేతలుగా 1వ స్థానం, బ్యాడ్మింటన్ (పురుషులు-డబుల్స్) విజేతలు గా 1వ స్థానం మరియు వాలీబాల్ (పురుషులు) రన్నర్లుగా 2వ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. విద్యార్థులలో క్రీడా స్ఫూర్తి, శారీరక దృఢత్వాన్ని ప్రోత్సహించడానికి తగినంత ప్రోత్సాహం, వనరులను అందిస్తూ, ప్రతిభ, చక్కటి విద్యకు కేంద్రంగా తమ కళాశాల నిలుస్తోందని పేర్కొన్నారు. విజేతలను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, ఫిసికల్ డైరెక్టర్ డాక్టర్ దామోదరన్, మంజు విక్రమ్ అభినందనలు తెలియజేశారు.

ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

# పశు సంపద అభివృద్ధికి చర్యలు

**- జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కె.గుణశేఖర్**

ముఖా ముఖి..

ప్రజాశక్తి-రాయచోటి

**జిల్లాలో పాడి రైతులకు అందుబాటులో ఉండి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల పశు సంపద అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పశు సంవర్తక శాఖ అధికారి కె.గుణశేఖర్ పెళ్లై పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో పశు సమర్థ శాఖ అమలు చేస్తున్న పథకాలు, పాడి రైతుల పెంపకం, వ్యాధులను ఎలా నివారించాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.**

**జిల్లాలో పశుసంవర్ధక శాఖ కార్యాలయాలు, సిబ్బంది వివరాలు తెలియజేయండి?**

జిల్లా వ్యాప్తంగా ఆరు నియోజకవర్గాలలో 30 మండలాల్లో మూడు డివిజన్‌లలో రాయచోటి, మదనపల్లె, రాజంపేట ప్రాంతాలలో ఉప సంచాలకులు ఉన్నారు. మూడు డివిజన్లలో 18 మంది సహాయ సంచాలకులు, పశువైద్యాధి కారులు 72 మంది, గ్రామీణ పశు వైద్యాధికారులు 63 మంది ఉన్నారు. 226 రైతు సేవా కేంద్రాలలో పశు వైద్య సహాయకులు, 116 మంది గోపాల మిత్రలు ఉన్నారు.

**జిల్లాలో ఆవులు, గేదెలు ఎన్ని ఉన్నాయి?**

జిల్లా వ్యాప్తంగా 2.71 లక్షల ఆవులు, 1.06 లక్షల గేదెలు ఉన్నాయి. 18 లక్షల గొర్రెలు, 3 లక్షల మేకలు ఉన్నాయి. 28 లక్షల కోళ్లు ఉన్నాయి. మదనపల్లె, పీలేరు, కలికిరి ప్రాంతాలలో కోళ్ల పారాలు ఎక్కువగా ఉన్నాయి.

**పశువులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నారా?**

జిల్లాలో ప్రతి రైతు పశువులకు బీమా చేయించుకోవాలి. జిల్లాలో ఇప్పటివరకు మృతి చెందిన పశువులకు బీమా చెల్లించాం. ప్రస్తుతం బీమా పథకం కొనసాగిస్తున్నాం. దారిద్ర రేఖకు దిగువన ఉన్న రైతులు వారి పశువులు చెల్లించిన ప్రీమియం 85 శాతంలో రాయితీతో 15 శాతం రైతు కట్టాలి. ఒక రైతు ఐదు పశువులకు వరకు బీమా చేసుకోవచ్చు. 50 గొర్రెలు, మేకలకు బీమా చేసుకోవచ్చు. మూడు సంవత్సరాల లోపు మరణిస్తే సమీప పశు సమర్ధ శాఖ వారు నష్టపరిహారం చెల్లిస్తారు. 3 శాతం ప్రీమియంతో గొర్రెలు, మేకలు, పందులు ఒక సంవత్సరం బీమా రూ.6 వేలు రైతు చెల్లించవలసిన ప్రీమియం రూ.180, ప్రభుత్వ రాయితీ రూ.153 లబ్ధిదారులు వాటా రూ.27, 4.5 శాతం ప్రీమియంతో గొర్రెలు, మేకలు, పందులు రెండు సంవత్సర కాలానికి బీమా రూ.6 వేలు చెల్లించవలసిన ప్రీమియం రూ.270, ప్రీమియంలో ప్రభుత్వ రాయితీ రూ.85 శాతం రూ.230, లబ్ధిదారిని వాట రూ.15 శాతం రూ.40, 4.5 శాతం ప్రీమియంతో ప్రీమియంతో గొర్రెలు, మేకలు, పందులకు మూడు సంవత్సరాల కాలానికి బీమా రూ.6 వేలు, చెల్లించవలసిన ప్రీమియం రూ.375, ప్రీమియంలో ప్రభుత్వ రాయితీతో రూ.319, లబ్ధిదారిన వాటా రూ.56 చెల్లించవలెను. మేలు జాతి పసువులకు 6.40 శాతం ప్రీమియంతో మూడు సంవత్సరాల కాలానికి రూ.30 వేలు, చెల్లించవలసిన ప్రీమియం రూ.1920, ప్రభుత్వ రాయితీతో రూ.1632, లబ్ధిదారుని వాటా రూ.288, నాటు జాతి పశువు 6.40 శాతం ప్రీమియంతో మూడు సంవత్సరాల కాలానికి బీమా రూ.15 వేలు, చెల్లించవలసిన ప్రీమియం రూ.960, ప్రభుత్వ విలియంలో ప్రభుత్వ రాయితీతో రూ.816, లబ్ధిదారులు వాటా రూ.144 చెల్లించవలెను మరిన్ని వివరములకు దగ్గర్లోని పశువైద్యశాలలో గాని ద్వైత సేవా కేంద్రంలో గాని సంప్రదించవచ్చును.

**పశువులకు ఎలాంటి వ్యాధులు సంభవిస్తున్నాయి?**

పశువులకు ప్రస్తుతం గాలి కుంట వ్యాధి వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధిని నివారించడానికి మార్చి 1వ తేదీ నుండి 30 తేదీ వరకు టీకాలు వేశాం. బ్రూసెల్లోజ్ వ్యాధి నివారణకు 4-8 నెలల దూడలకు ముడదపాలుగా జిల్లా వ్యాప్తంగా 39,500 డోస్‌లు వేశాం. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం గొర్రెల, మేకల వ్యాధి నివారణకు టీకాలు వేయడానికి ఈ నెలలో ప్రారంభిస్తాం.

**మినీ గోకులాలు ఎన్ని మంజూరయ్యాయి?**

జిల్లా వ్యాప్తంగా 2045-25 సంవత్సరానికి 1,156 మినీ గోకులాలు మంజూరయ్యాయి. వివిధ దశల్లో నిర్మాణంలో పనులు జరుగుతున్నాయి. సంవత్సరానికి 2,400 మినీ గోకులాలు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

**జిల్లా వ్యాప్తంగా పశువైద్య వాహనాలు ఎన్ని ఉన్నాయి?**

జిల్లా వ్యాప్తంగా 14 పశువైద్య వాహనాలు మంజూరయ్యాయి. మొ దటి దఫాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 6 వాహనాలు ఉన్నాయి వాటిని తాత్కాలికంగా నిలిపివేశాం. ఈ నెల ఆఖరిలో పునార ప్రారంభించిడానికి కృషి చేస్తున్నాం. వాహనాలు యధావిధిగా సేవలు అందిస్తున్నాం. గ్రామీణ ప్రాం తంలో రైతులకు అవసరం ఉన్న చోటికే వెళ్లి పశువులకు వైద్య సేవలు అందిస్తు న్నాం. టోల్ ఫ్రీ నెంబర్ 1962కి ఫోన్ చేసి వైద్య సేవలు రైతులు పొందవచ్చును.

**సబ్సిడీకి గేదెల ఏమైనా ఇస్తున్నారా?**

ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా పాడి పశువులను యూనిట్లు సబ్సిడీతో పొందవచ్చు.

**జిల్లాలో శిథిలా వస్థకు చేరిన పశుసంవర్ధక శాఖ కార్యాలయాలెన్ని ఉన్నాయి?**

జిల్లా వ్యాప్తంగా మొత్తం 70 పశుసంవర్త శాఖ భవనాలు ఉన్నాయి. 13 భవనాలను వరకు శిథిలావ్యవస్థకు చేరాయి. వాటి వివరాలు ఉన్నతాధి కారులకు ప్రతిపాదించాం. బడ్జెట్ మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

**వేసవిలో గేదెలకు దాహన్ని తీర్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

వేసవి కాలంలో దృష్టిలో ఉంచుకొని గేదెలు, మేకలు, గొర్రెల దాహం తీర్చేందుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకంతో కింద పశువులకు గ్రామీణ ప్రాంతాలలో కూడలి ప్రాంతాలలో (నీటి సౌకర్యం ఉన్నచోట) నీటి తొట్ల నిర్మాణం చేపడుతున్నాం. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1084 మంజూరయ్యాయి.

**పశుగ్రాస అధిక మించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

జిల్లాలో 75 శాతం రాయితీతో పశుగ్రాసోత్పత్తి విత్తనాలు రైతు సేవా కేంద్రంలో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. సాగునీటి సౌకర్యం ఉన్న రైతులు ఆధార కార్డు జిరాక్స్ తీసుకొని పొందవచ్చును. 100 శాతం సబ్సిడీతో ఉపాధి నిధుల ద్వారా బహు వర్షిక పశుగ్రాసాన్ని 10 సెంట్లు నుంచి 50 సెంట్లు వరకు ఉండవచ్చును.

ఆవేదన లఘు చిత్రాన్ని ఆవిష్కరిస్తున్న ట్రాఫిక్ డిఎస్‌పి శ్రీనివాసులు నాయుడు

## ఆ..వేదన లఘుచిత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ఆ..వేదన లఘు చిత్రం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జిఆర్‌డి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.మునిగోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి జిల్లా ట్రాఫిక్ డిఎస్‌పి శ్రీనివాసులు నాయుడు, కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మునిరత్నం, కార్యదర్శి కరుణాకర్, ఉపాధ్యక్షులు జగన్మోహన్, గౌరవ సలహాదారు ప్రొఫెసర్ శ్రీనివాసులు, ఎబిసి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి, చిత్ర నిర్మాత ధనలక్ష్మి, డైరెక్టర్ రాజేంద్ర, వెలుగు సంస్థ కన్వీనర్ భాగ్యలక్ష్మి, ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ తిమ్మయ్య, ది టౌన్ ఎఫెక్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు, డిస్ట్రిక్ కన్స్యూమర్ ఫోరం డైరెక్టర్ రేగడి ప్రసాద్ కుమార్, కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంజనేయ కుమార్, మరసం ప్రధాన కార్యదర్శి యుగంధర్ ఆచారి, ప్రముఖ నవలా రచయిత టిఎస్ఎ కృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆ..వేదన లఘు చిత్రాన్ని జిల్లా ట్రాఫిక్ డిఎస్‌పి శ్రీనివాసులు నాయుడు, ఎబిసి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి, చిత్ర నిర్మాత ధనలక్ష్మి ఆవిష్కరించారు. అనంతరం ఆవేదన చిత్రం యూనిట్ సభ్యులందరికీ దుశ్శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి, వారి నటన ప్రతిభను ప్రశంసించారు. అదేక్రమంలో సమాజంలో వివిధ రూపాలలో సేవలను అందిస్తూ యువతకు ఆదర్శంగా నిలిచిన డిస్ట్రిక్ కన్స్యూమర్ ఫోరం డైరెక్టర్ రేగడి ప్రసాద్ కుమార్ సేవలను అభినందిస్తూ సన్మానించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ నవసమాజ నిర్మాణంలో సీనియర్ సిటిజన్స్ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎవరో వచ్చి ఏదో చేస్తారని వేచి చూసే ధోరణిని వీడనాడి నేరుగా కార్యోన్ముకులై నప్పుడు సమస్యల పరిష్కారం, అభివృద్ధి సాధ్యమవుతాయని పేర్కొన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ ఆ..వేదన లఘు చిత్రం ద్వారా వృద్ధాప్యంలో వయోవృద్ధుల జీవన ప్రయాణాన్ని ఆవిష్కరించడం జరిగిందని తెలిపారు. త్వరలోనే రెండవ భాగం నిర్మాణం మొదలవుతుందని చెప్పారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఇప్పటి వరకు వృద్ధాప్యంలో ఉన్న తాము తమ సమస్యల పరిష్కారానికే పరిమితమయ్యామని పేర్కొన్నారు. ఇకపై సమాజ పునర్నిర్మాణానికి ప్రయత్నం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక సేవల్లో ఇటీవల డాక్టరేట్‌ను అందుకున్న ఎన్.మునిగోపాలకృష్ణను సీనియర్ సిటిజన్స్ దుశ్శాలువ, జ్ఞాపిక, డాక్టరేట్ పట్టాను అందించి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆల్ ఇండియా కాన్ఫిడరేషన్ అధ్యక్షులు బదానే పరమపదించిన నేపథ్యంలో ఆయనకు అశ్రునివాళులర్పించి మౌనం పాటించారు.

# వెంకటాద్రి కుటుంబానికి రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలి

**- సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు డిమాండ్**

మృతి చెందిన రైతు వెంకటాద్రి కుటుంబాన్ని పరామర్శిస్తున్న శ్రీనివాసులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఈనెల 3వ తేదీ ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన రైతు వెంకటాద్రి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీ పెద్దవంకపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు వెంకటాద్రి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి, రెవెన్యూ అధికారులు, కార్యాలయాల చుట్టూ తిప్పుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే గ్రామానికి చెందిన రైతులు వెంకటాద్రి భూమి ఆక్రమించుకొని, మామిడి చెట్లను నాటారని, అధికారుల స్పందించక పోవడంతోనే రైతు ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బాధిత కుటుంబానికి అండగా న్యాయం కోసం ధర్నా చేసిన మాజీ సైనికులపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అక్రమ కేసుల వలన పోలీసులు, రెవెన్యూ అధికారులపై ఉన్న నమ్మకాలు కూడా ప్రజల్లో పోతాయన్నారు. మాజీ సైనికులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉప సంహరించుకోవాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని, ఐదు ఎకరాలు భూమి, రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మనోహర్ రెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సైనికుడి కుటుంబానికి న్యాయం చేయాలి

**- పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి**

మండలం మూరేవాండ్లపల్లి గ్రామం పెద్దవంకపల్లికి చెందిన మాజీ సైనికుడు చంద్రగిరి లక్ష్మన్న కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వెంకటాద్రి ఆత్మహత్య చేసుకుని పది రోజులు గడుస్తున్నా ప్రభుత్వం, ఉన్నతాధికారులు మృతుని కుటుంబానికి న్యాయం చేయకపోగా బాధిత కుటుంబానికి అండగా నిలిచిన మాజీ సైనికుల సంక్షేమ సంఘం నేతలపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయడం దారుణమన్నారు. రాజ్యాంగ బద్ధంగా శాంతియుతంగా నిరసన తెలపడమే మాజీ సైనికులు చేసిన నేరమా అని ప్రశ్నించారు. మాజీ సైనికులు ఏమి తప్పు చేశారో చెప్పాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. బాధిత కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, మదనపల్లి డిఎస్‌పి తదితరులను కలిసి విన్నవించినా ఇప్పటి వరకు ఏలాంటి స్పందన లేకపోవడం శోచనీయన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

**ప్రజాశక్తి-కలకడ**

పూర్వ విద్యార్థులు అపూర్వ కలయికతో కలుసుకోవడం జరిగింది. మండలంలోని బాటవారిపల్లెలో ఉన్న విశ్వ జ్యోతి హైస్కూల్‌లో 2011-12వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ అపూర్వ కలయికతో ఒకచోట చేరి తాము చదివిన విషయాలను నెమరు వేసుకున్నట్టు తెలిపారు. 10వ తరగతి వరకు ఇదే పాఠశాలలో చదివి ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగి వివిధ ఉద్యోగాలు వివిధ రకాల సంస్థల్లో పనిచేస్తున్న వారు మొత్తం ఒక గూటికి చేరి తాము గతంలో చదివిన రోజులలో చేసిన అల్లర్లు నెమరు వేసుకుని సంతోషంతో గడుపుకోవడం విశేషం. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను క్రమశిక్షణను అలవాటు చేసుకుని పెద్దలను గౌరవించడం మర్యాదగా పలకరించడం వంటి విషయాలను నేర్పిన ఉపాధ్యాయులను దుశ్శాలువా, పూల మాలలతో వారిని ఘనంగా సత్కరించారు. గెట్ టుగెదర్ ప్రోగ్రాం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ విద్యార్థుల అపూర్వ కలయికలో ఉపాధ్యాయులు గంగోత్రి నాయుడు, రెడ్డప్పరెడ్డి, కుమార్‌నాయుడు, బాబ్జాన్, రఫీ, సయ్యద్‌బాషా, హసన్, హుస్సేన్, హైమావతి, నాగరత్న, పాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించడం ఎంతో గర్వకారణంగా ఉందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఎక్కడెక్కడో తమతమ పనులలో వృత్తిరీత్యా ఉన్నప్పటికీ తాము గెట్ టుగెదర్ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పిన వెంటనే మా కార్యక్రమానికి హాజరైన ప్రతి ఉపాధ్యాయులకుఎప్పటికీ రుణపడి ఉంటామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు కలిసి సహపంక్తి భోజనం చేసి సమావేశాన్ని ముగింపు చేసినట్లు తెలిపారు.

ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

## సత్తా చాటిన నారాయణ విద్యార్థులు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో మదనపల్లె నారాయణ కాలేజీ విద్యార్థులు సత్తాచాటారు. ఎంపిసిలో నివేదిత 466, నందిని 432 మార్కులు సాధించి జిల్లా ర్యాంకులు సాధించారు. 460 మార్కులకు పైన 8మంది, 400 పైగా 95 మంది సాధించడం జరిగింది. బైపిసి విభాగంలో 400 పైగా 11 మంది విద్యార్థులు సాదించారు. ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో సుహాన, ప్రసన్న 985, బైపీసిలో అతికభాను 980 మార్కులు సాదించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ తారక రామానాయుడు, సురేష్, అధ్యాపకులు అభినందించారు.

## పేదింట వికసించిన విద్యా కుసుమం

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

షేక్ రేష్మా

ఇంటర్ పరీక్షా ఫలితాలలో తన ప్రతిభను చాటుతూ విద్యార్థిని షేక్ తస్లీమ్ 947/1000 మార్కులు సాధించి తన సత్తాను నిరూపించుకున్నది. వివరాల్లోకి వెళితే.. ముష్టూరులోని మధ్యతరగతి కుటుంబానికి చెందిన షేక్‌మహమ్మద్‌వల్లి, షేక్ రేష్మ దంపతుల కుమార్తె షేక్ తస్లీమ్ మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ చదువుతున్నది. ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలోఎంపిసిలో 947/1000 ఉత్తమ మార్కులు సాధించి విద్యకు పేదరికం అడ్డు కాదంటూ నిరూపిస్తూ మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. కళాశాలలోని ఉపాధ్యాయుల నుంచి, గ్రామస్తుల నుంచి విద్యార్థినికి ప్రశంసలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమార్తె మొదట నుంచి చదువులో చురుగ్గా ఉంటుందని అన్నారు. మోడల్ స్కూల్లో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాలలో కూడా తమ కుమార్తె ఉత్తమ మార్కులు సాధించిందని, అదే క్రమంలో ద్వితీయ సంవత్సరంలో కూడా 947 మార్కులు సాధించి మండలంలో ద్వితీయ స్థానాన్ని సాధించడం తమకు గర్వకారణంగా ఉందన్నారు. విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్ ఎం.రాజశేఖర్, అధ్యాపకులు

## 'వీరభద్ర' విద్యార్థుల విజయభేరి

**ప్రజాశక్తి-రాయచోటి**

ఇంటర్ ఫలితాలలో శ్రీవీరభద్ర జూనియర్ కాలేజ్ విద్యార్థులు విజయభేరి మోగించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎం.రాజశేఖర్, ప్రిన్సిపల్ ఎం.హరి ప్రసాద్ మాట్లాడుతూ సెంకండ్ ఇయర్ ఎంపిసిలో ఎస్.రెడ్డిపల్లవి 1000/978మార్కులు, మొదటి సంవత్సరం పి.రెడ్డిబాషా ,454/470, పి.మల్లికార్జున 446/470, ఎన్.నంద ప్రకాష్ 439/470 సాధించారని తెలిపారు. మొదటి సంవత్సరం బైపిసిలో ఎస్.కె .అన్విర 416/440 మార్కలు వచ్చాయన్నారు. భవిష్యత్తులో మంచి స్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు.2024-25 విదుదలైన ఒకేషనల్ పరిక్షా ఫలితాలలో శ్రీరాజు ఒకేషనల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించారన్నారు. ఎంఎల్‌టి మొదటి సంవత్సరం లో టి.వెన్నెల 500 మార్కులకు గాను 491 మార్కులతో జిల్లా నుంచి మొదట స్థానంలో నిలిచారన్నారు. రెండవ సంవత్సరంలో ఎంపిహెచ్‌డబ్ల్యూఒ ఎస్ .అలియా బేగం 1000/966 మార్కులు సాధించినట్లు వారు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**ప్రజాశక్తి-రామాపురం :** మారుమూల గ్రామాల్లోని ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్లు రబ్బాని ఇలియాస్‌బాషా అజ్మతుల్లాఖాన్ పేర్కొన్నారు. మండలంలోని గువ్వలచెరువులో తెలుగు మీడియం పాఠశాలలో ఆదివారం నూరాఅల్‌ముబారక్ చారిటబుల్ ట్రస్ట్ కడప వారి ఆధ్వర్యంలో లైఫ్ లైన్ ఆసుపత్రి వారిచే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి గువ్వలచెరువు, కసిరెడ్డిగారిపల్లి, గోపగుడిపల్లి గ్రామాల నుంచి వెయ్యి మంది ప్రజలు హాజరయ్యారు. వీరిలో 600 మందికి600 వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్షలు, స్కానింగ్ చేసి మందులు అందజేశారు. వైద్యశిబిరంలో డాక్టర్ ఫరూక్, డాక్టర్ రాంచరణ్‌రెడ్డి, డాక్టర్ హిమాంసాదిక్, డాక్టర్ ఆనంద్, సురేష్‌కుమార్ వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు , మహిళలు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు

## ప్రతిభ చాటిన గురుకుల కళాశాల విద్యార్థులు

**ప్రజాశక్తి-నందలూరు**

మహాత్మా జ్యోతిబాపూలే బిసి గురుకుల కళాశాల, నందలూరు విద్యార్థులు శనివారం వెలువడినటువంటి ఇంటర్మీడియట్ ఫలితాలలో వారి ప్రతిభను చాటారు. ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో 134 మంది కి గాను 131 మంది పాస్అయ్యి 97.9 శాతం ఉత్తీర్ణత సాధించగా మొదటి సంవత్సరంలో 144 మందికి గాను 135 మంది పాస్ అయ్యి 93.54 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండ్ ఇయర్ ఎంపిసిలో 979 /1000 మార్కులతో కె.జయ లక్ష్మి , బై.పి.సి నందు 979/1000 మార్కులతో ఎ.త్రిలోచన, సిఇసిలో 952 /1000 మార్కులతో కె.పావనిలు కళాశాల టాపర్లుగా నిలిచారు. అలాగే ఫస్ట్ ఇయర్ ఎంపిసిలో 459 /470 మార్కులతో ఎ.చంద్ర కళ , బై.పి.సి నందు 423/440 మార్కులతో ఎన్.పూజిత శ్రీ సిఇసిలో 481/500 మార్కులతో ఎ.లక్ష్మి దేవి లు కళాశాల టాపర్లుగా నిలిచారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులకు కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరి, సిబ్బంది అభినందనలు తెలిపారు. **చిన్నమండెం :** ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరములో 98 శాతం ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపల్ వి.రమేష్ తెలియజేశారు. ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో కె.గీతాంజలి 964మార్కులతో టాపర్ గా నిలిచారని అన్నారు. ఎస్ హమీద్ ఖాన్951 మార్కులు, ద్వితీయ సంవత్సరం బైపిసిలో కె.రెడ్డి పూజిత 756 సిఇసి గ్రూపులో టాపర్స్ గా నిలవడం జరిగింది. ప్రథమ సంవత్సరం ఎంపిసిలో ఏ వైష్ణవి 457మార్కులు, బైపిసిలో సుమియ 433 మార్కులు సాధించినట్టు తెలిపారు. ప్రథమ సంవత్సరం 88శాతం ఫలితాలు సాధించినట్టు తెలిపారు. కెజిబివిలో ప్రథమ సంవత్సరం 33మందికి గాను32 మంది, ద్వితీయ సంవత్సరం 6 మందికి గాను 6 మంది ఉత్తీర్ణత సాధించారని కళాశాల ఎస్ఒ అరుణ తెలియజేశారు. విద్యార్థులు ఇలాగే మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరుకుంటున్నట్లు ఆమె తెలిపారు. ఫలితాలు సాధించడములో విశేష కృషి చేసిన అధ్యాపకులకు అందరికీ ఆదర్శ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ అభినందనలు తెలిపారు. **మదనపల్లె అర్బన్ :** ఇంటర్ పరీక్ష ఫలితాల్లో మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణమూర్తి తెలిపారు. జనరల్ విభాగంలో సాబల్ ఫిర్దోస్ 982, ఏబి ఇక్రా 959, సమీర 939 మార్కులు సాధించారు. ఒకేషనల్ విభాగంలో అర్షియా 945, హలీమా 941, రుచిత 912 మార్కులు సాధించి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. మొదటి సంవత్సరం ఇంటర్ లో అప్స 456, రోహిణి 449, సాఫియా ఫిర్దోస్ 421, నాగమణి 473, శారద 434 మార్కులు సాధించారు. ఒకేషనల్ విభాగంలో చరిత 472, హిందూ 461, శిరీష 470 మార్కులతో మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

పట్టణంలోని చంద్రకాలనీలో ఉన్న గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో వెలువడిన ఇంటర్ ఫలితాల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో 38 మంది విద్యార్థులు పరీక్షలు రాయిగా 38 మంది పాసయ్యారు. పూర్ణ తేజ 448, హరిత 425 మార్కులతో టాపర్స్ గా నిలిచారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో 35 మంది పరీక్షలు రాయిగా 34 మంది పాసయ్యారు. బైపీసీలో 33 మంది పరీక్షలు రాయగా 30 మంది పాసై 94 శాతం ఉత్తీర్ణత సాధిం చారు. రెడ్డిప్రియ 956, హర్షిత 956, ఆ సైని కులు ప్రిన్సిపల్ వసుం ధర దేవి తెలిపారు వీరిలో మొదటి సంవ త్సరం విద్యార్థులు పూర్ణ తేజ 48 హరిత 425 మార్కులు సాధించగా ద్వితీయ సంవత్సరం ఎంపీసీ లో రెడ్డిప్రియ 956, హర్షితా 956, బైపీసీలో వనజ 962 మార్కులు సాధించి ఉత్తమ విభాగంలో నిలిచారని ప్రిన్సిపల్ వసుందరా దేవి తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

నందలూరు : జయలక్ష్మి, త్రిలోచన, పావని

### 'ఫలితాల్లో అమ్మాయిలదే హవా'

**తంబళ్లపల్లి :** ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలలో అమ్మాయిలు ప్రతిభ చాటారు.తంబళ్లపల్లె కెజిబివి విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ఇంటర్ సెకండ్ ఇయర్ లో ముగ్గురు విద్యార్థులు పరీక్షలు రాయగా.. ముగ్గురు పాసై 100శాతం ఉత్తీర్ణత సాధించినట్టు సుమతి తెలిపారు. మొదటి సంవత్సరంలో 11 మందికి 10 మంది పాసయ్యారని 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. వైష్ణవీ 420(బైపిసి) మార్కులతో టాపర్‌గా నిలిచిందన్నారు. తంబళ్లపల్లె మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 67 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 64 మంది పాసై 97శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ హేమంత్ తెలిపారు. జనార్దన్ నాయుడు 953(ఎంపిసి)టాపర్‌గా నిలిచాడన్నారు. ఫస్ట్ ఇయర్లో 80మందికి 70మంది పాసయ్యారని, 88శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అస్మిత 457(ఎంపిసి) మార్కులతో టాపర్‌గా నిలిచిందన్నారు. విద్యార్థులను అభినందించారు. తంబళ్లపల్లె జూనియర్ కాలేజ్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరంలో 50మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 46మంది పాసైనట్లు ప్రిన్సిపల్ అమరేంద్రబాబు తెలిపారు. శ్రావణి 944(బైపిసి) టాపర్‌గా నిలిచిందన్నారు. ఫస్ట్ ఇయర్‌లో 55 మందికి 40మంది పాసైనట్లు తెలిపారు. రుకయ్య తబస్సుం 418(బైపిసి) మార్కులతో టాపర్‌గా నిలిచిందన్నారు.

## రీజెన్సీ నలందా విద్యార్థుల జయభేరి

విజయ కేతనం చూపుతున్న విద్యార్థులు

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

రాజంపేట రీజెన్సీ నలందా విద్యాసంస్థల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాలలో జయభేరి మోగించారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను రీజెన్సీ నలందా విద్యా సంస్థల అధినేత డాక్టర్ జి.ఎన్‌నాయుడు అభినందించారు. ఈ సందర్భంగారాయన మాట్లాడుతూ ప్రతి ఏడు రాష్ట్రస్థాయిలో ఇంటర్మీడియట్ ఫలితాలలో నలంద విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తూనే వస్తున్నారన్నారు. మంచి ఫలితాలు సాధించినందుకు కళాశాల అధ్యాపకులను, సిఎఒ గుడారు విజయ్ చందును, ప్రిన్సిపల్ సాదు సుబ్బరాయుడును ఆయన అభినందించారు. భవిష్యత్తులో కళాశాలలో విద్యా ప్రమాణాల పెంపుకు మరింత కృషి చేసి రాష్ట్రంలోనే రీజెన్సీ నలందా విద్యాసంస్థలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. సిఇఒ విజయ్ చందు మాట్లాడుతూ మొదటి సంవత్సరము ఎంపిసి విభాగంలో బి.శివలక్ష్మి, జి.నవ్యశ్రీ 465/470, ఇద్రిజ్ 464/470 , బైపిసి విభాగంలో రుక్సానా బేగం 431/440 సిఇసి విభాగం లో కె.ధృతిక 471/500 దక్కించుకోగా, ద్వితీయ సంవత్సరం ఎంపిసి విభాగంలో 987/1000, బైపిసి విభాగంలో 988/1000 జె.మల్లిక, టి..తేజస్వీనిలు, సిఇసి విభాగంలో ఎన్.సంధ్య 975/1000 రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించినట్లు తెలిపారు. అధ్యాపకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## టౌన్ టాపర్‌గా నిలిచిన పీలేరు శ్రీచైతన్య విద్యార్థులు

**ప్రజాశక్తి-పీలేరు**

యాష్మిన్(ఎంపిసి), ఈషా(ఎంపిసి)

2005 మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షల ఫరితాల్లో పీలేరు శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు టౌన్ టాపర్లుగా నిలిచారని కళాశాల కరస్పాండెంట్ ఆర్. సుధానందరెడ్డి, ప్రిన్సిపాల్ కె. నానార్జున రెడ్డి తెలిపారు. శనివారం విడుదలైన ఫలితాల్లో పీలేరు శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ ఎంపిసి గ్రూపులో ఎస్. యాస్మిన్ 1000/988 మార్కులతో టౌన్‌టాపర్‌గా నిలిచారు. ఎల్.పూజిత - 980, బి. రెడ్డిలక్ష్మి - 979 మార్కులు సాధించారు. బైపిసి గ్రూప్‌లో ఎం.రూపిక, జి.ఈషా 973మార్కులతో టౌన్ టాపర్లుగా నిలిచారు. అదే గ్రూపుకు చెందిన షర్మిన్ - 965 మార్కులతో టౌన్ సెకండ్ టాపర్‌గా పి. గౌసియా- 960 మార్కులతో టౌన్ మూడో టాపర్‌గా నిలిచారు. సిఇసి గ్రూపులో జి. ఉష-962 మార్కులతో టౌన్ టాపర్ స్థానం పొందారు. డి పల్లవి - 958 మార్కులు, పి గిరీష్మ- 957 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపిసి గ్రూపుకు చెందిన ఎం. రెడ్డిలోహిత 470/461 మార్కులకు టౌన్ ఆఫర్ గా గెలిచారు. ఎన్ గురు లహరి- 452, ఎం. హేమశ్రీ-450 మార్కులకు టౌన్ ద్వితీయ, తృతీయ స్థానాలను పొందారు. బైపీసీ గ్రూపుకు చెందిన ఎస్. సాధీయా440/427 మార్కులతో, ఎస్.హప్సా సాదియా - 423 మార్కులకు పట్టణంలో ప్రథమ ద్వితీయ స్థానాన్ని సొంతం చేసుకున్నారు. సిఇసి గ్రూపుకు చెందిన ఎస్. జోయా అస్లీ - 466, బి.పద్మజ-456 మార్కులతో పీలేరు పట్టణంలో ప్రథమ ద్వితీయ స్థానంలో నిలిచారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ విధానం రెడ్డి, ప్రిన్సిపల్ నాగార్జునరెడ్డి, డైరెక్టర్లు జనార్ధనరెడ్డి, చంద్రశేఖర్, లోకేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ నాయుడు అభినందించారు.

## జ్ఞానాంబిక విద్యార్థుల విజయ దుందుభి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

మదనపల్లె పట్టణంలోని జ్ఞానాంబిక కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్ష ఫలితాల్లో మెరిశారు. అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో చంద్ర 463, హర్షవర్ధన్ రెడ్డి 463, రీతు 460, తంజుమ్ 460, సాజియా 435, తస్మియా 434, గాయత్రి 488, సయద్ బాషా 482, హర్షిత 468, వసుంధర 463, మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. అదే విధంగా ద్వితీయ సంవత్సరం ఇంటర్ లో రెడ్డి సాయిదర్శన్ 985, ఇంద్రజ 984, నజియా 977, షాహినా 976, లక్ష్మీనరసింహ 979, ఆమని 978, వైష్ణవి 979, అర్షా బేగం 955 మార్కులు సాధించి ఔరా అనిపించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినందుకు కరస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి, వెంకటాచలపతి లు శుభాకాంక్షలు తెలియజేసి, మిఠాయిలు తినిపించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో గురుప్రసాద్, రమాదేవి, అధ్యాపకులు

## ప్రతిభ చాటిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

**ప్రజాశక్తి-కలకడ**

క్రమశిక్షణకు మారుపేరుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నిలిచిందని ప్రిన్సిపల్ జయభారతి, వైస్ ప్రిన్సిపల్ రమణయ్య తెలిపారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ఈ ఏడాది73 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 50 మంది ఉత్తీర్ణులై 68శాతం సాధించడం జరిగిందన్నారు. ద్వితీయ సంవత్సరంలో 50 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 40 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 80 శాతం సాధించడం జరిగిందన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపిసి చదువుతున్న టీ.సౌజన్య 451 మార్కులు, డి.భావన 442 మార్కులు సాధించే ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నట్లు తెలిపారు.ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ఎంపిసి చదువుతున్న ఎం.గణేష్ 950 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, సి.గుణశేఖర 838 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలవడం జరిగిందని వారు తెలిపారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వచ్చిన ఫలితాలు ఆధారంగా ఉత్తీర్ణులైన విద్యార్థులను అధ్యాపకులు అభినందనలు తెలిపారు. **రాజంపేట అర్బన్ :** ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రభంజనం సృష్టించింది. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 208 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 188 మంది ఉత్తీర్ణులై 90.38 ఉత్తీర్ణత శాతం సాధించారని, ప్రథమ సంవత్సరంలో 278 మంది పరీక్షకు హాజరై 191 మంది ఉత్తీర్ణత సాధించి 68.71శాతంతో రాణించినట్లు ప్రిన్సిపల్ ఎస్.వి. రమణ రాజు తెలిపారు. ఎంపిహెచ్ డబ్ల్యు సంవత్సరం విద్యార్థిని సి.పల్లవి 981/1000, ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో కె.రవితేజ 942/1000, ఎంపిసి ప్రథమ సంవత్సరంలో ఆర్. నాగ జ్యోత్స్న 463/470, ఈ.మనీష్ 462/470, బైపిసి ప్రథమ సంవత్సరంలో ఎస్.జనీల 414/440, ప్రథమ సంవత్సరం సిఇసి డి.వైష్ణవి 472/500, హెచ్ఇసి ప్రథమ సంవత్సరం సి.నందిని 421/500, ఏ ఎస్ టి ద్వితీయ సంవత్సరం విద్యార్థిని వి.కవిత 972/1000, సి ఎస్ ఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని పి.స్వప్న 970/1000, ద్వితీయ సంవత్సరం విద్యార్థి కే.వర్షిత్‌సాయి 921/1000, ఎఎస్ఃటి ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఎస్.అనిఫా 469/500, ప్రథమ సంవత్సరం సిఎస్ఇ విద్యార్థిని ఏ.గౌరీశ్రీవల్లి 477/500, ఎంపిహెచ్‌డబ్ల్యూ ప్రథమ సంవత్సరం విద్యార్థిని వై.లోకేశ్వరి 478/500, ప్రథమ సంవత్సరం విద్యార్థి పి.ప్రవీణ్ 454/500 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశా లను 1935లో బ్రిటిష్ వారు నిర్మించినప్పటి నుంచి నేటి వరకు కళాశాల అత్యున్నత విలువలు, క్రమశిక్షణతో జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిందని తెలిపారు.

రాజంపేట : మాట్లాడుతున్న ప్రిన్సిపల్

## హత్య కేసు నమోదులో పోలీసుల నిర్లక్ష్యం

**- జాతీయ రహదారిపై మృతురాలి బంధువులు నిరసన**

**- ఆందోళన విరమింపజేసిన ఎమ్మెల్యే**

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

మహిళను హత్య చేసి ప్రమాదకరంగా చిత్రీకరించి నగదు, నగలు దోచుకున్న సంఘటనను కేసు నమోదు చేయడంలో పోలీసులు తీవ్ర నిర్లక్ష్యం వహించారని మృతురాలి బంధువులు ఆదివారం స్థానిక తాలూకా పోలీస్ స్టేషన్ సమీపంలోని బెంగుళూరు జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. పోలీసులు పేదలైన మాకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని వాపోయారు. తమకు న్యాయం జరిగే వరకు అందోళన విరమించేదే లేదని పోలీసులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సమయంలో మృతురాలి కుమార్తెలు సొమ్మసిల్లి పడిపోగా, మనవడు మనోహర్ పోలీసులకు వ్యతిరేకంగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడి నిరసన వ్యక్తం చేశాడు ఎమ్మెల్యే ఇక్కడికి వచ్చి మాకు న్యాయం చేసే వరకు విరమించేది లేదని పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. సిఐలు రామచంద్ర, సత్యనారాయణ, ఎస్ఐలు గాయత్రి, శివారెడ్డి, అన్సర్‌బాషాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళన కారులతో చర్చించారు. ఆటో డ్రైవర్ బాడుగ రూ.5 ఇవ్వనందుకు కొట్టి చంపాడని పోలీసులు కేసు నమోదు చేయడం ఎంత వరకు న్యాయమని ఎమ్మెల్యేకు వివరించారు. నగలు, నగదును దోచుకొని హత్య చేశారని అన్నారు. పోలీసులు తమ పట్ల దురుసుగా వ్యవహరించారని ఎమ్మెల్యే, దృష్టికి తీసుకవచ్చారు. తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. దురుసుగా వ్యవహరించిన పోలీసులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# క్రైం కార్నర్

మృతి చెందిన ఉపాధ్యాయురాలు శారద  తీవ్రంగా గాయపడిన వెంకటరమణ, కీర్తి

## కారును ఢీకొన్న లారీ

**- మహిళా ఉపాధ్యాయురాలు మృతి**

**- భర్త, కుమార్తె పరిస్థితి ఆందోళనకరం**

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్/కలకడ**

కారును లారీ ఢీ కొన్న ప్రమాదంలో మహిళా ఉపాధ్యాయురాలు మృతి చెందగా ఆమె భర్త, కుమార్తె తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం పుంగనూరు మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కలకడ మండలం, ఎర్రయ్యగారిపల్లికి చెందిన వెంకటరమణ భార్య శారద(40) ఇద్దరూ ములకలచెరువులోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఆదివారం కుమార్తె కీర్తి(17)తో కలసి కారులో పుంగనూరుకు బయల్దేరారు. మార్గమధ్య లోని పుంగనూరు మండలం సుగాలిమిట్ట ఐషర్ లారీ ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చూడగా శారద మృతి చెందినట్లు నిర్ధారించారు. టీచర్ వెంకటరమణ, అతని కుమార్తె కీర్తి తీవ్రంగా గాయపడడంతో చికిత్సలు అందించారు. వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు వారిని బెంగళూరుకు తరలించారు. పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆదివారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. ఎస్ఐ పివి.రమణ కథనం మేరకు.. పెద్దమండ్యం మండలం, కలిచర్లకు చెందిన రాజశేఖర్ గ్రామంలో జరుగుతున్న జాతరకు బి.కొత్తకోట మండలం, బండిమీదపల్లెకు చెందిన స్నేహితుడు భాస్కర్‌రెడ్డి (17)ని ఆహ్వానించడంతో శనివారం రాత్రి కలిచర్లకు వెళ్లాడు. ఆదివారం స్నేహితులతో కలిసి స్థానిక పాపిరెడ్డి చెరువుకి ఈతకు వెళ్లారు. చెరువులో ఈత ఆడుతూ మధ్యలోకి వెళ్లిన భాస్కర్‌రెడ్డి ఊపిరి ఆడక నీట మునిగి మృతి చెందాడు. గ్రామస్తులు మృతదేహాన్ని మృతుడి తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు డిప్లొమా చేస్తున్నట్లు తండ్రి రెడ్డెప్పరెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ద్విచక్ర వాహనాలు ఢీ : మహిళ దుర్మణం

**ప్రజాశక్తి-రామాపురం**

కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారి మండల పరిధిలోని విఆర్ స్కూల్ సమీపంలో టివిఎస్ ఎక్స్‌ఎల్‌ను వెనుకవైపు నుంచి బుల్లెట్ వాహన ఢీ కొనడంతో షేక్ గులాబ్ జాన్ మృతి చెందగా తండ్రి, కొడుకులు గాయాలు అయినట్లు ఎస్ఐ పివి.సుధాకర్ రెడ్డి తెలిపారు. బండపల్లి పంచాయతీ వెంకట్ రెడ్డిగారిపల్లెకు చెందిన షేక్‌గౌస్ మోదీన్ తన భార్య గులాబ్‌జాన్, కుమారుడు మహమ్మద్ అనాస్ ద్విచక్రవాహనంలో ఆదివారం రాయచోటి నుంచి వారి ఇంటి వస్తుండగా విఆర్ స్కూల్ సమీపంలోకి బాగానే వెనుకవైపు నుంచి వచ్చిన రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్ ఢీకొట్టిందని తెలిపారు. వెనుకవైపు కూర్చున్న గులాబ్‌జాన్‌కు తీవ్ర గాయాలు అయ్యాయని తెలిపారు. సమాచారం తెలుసుకుని పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన ముగ్గురిని108 సహాయంతో రాయచోటి ఆసుపత్రికి తరలించారని తెలిపారు. గులాబ్‌జాన్ పరిస్థితి తీవ్రంగా ఉండడంతో ఆమెను కడప రిమ్స్ రిఫర్ చేయగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## లారీ టైర్లలో చెలరేగిన మంటలు : తప్పిన ప్రమాదం

**ప్రజాశక్తి-రామాపురం**

మండల పరిధిలోని గువ్వల చెరువుఘాట్‌లో కోళ్లదానాతో కడప నుంచి చిత్తూరుకు బయలుదేరిన లారీ ఘాట్ ఎక్కి దిగుతున్న సమయంలో ఎండల తీవ్రతతో వేడికి లారీ టైర్లలో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ లారీని ప్రక్కన నిలుపుదల చేసి స్థానికుల సహాయంతో లక్కిరెడ్డిపల్లి ఫైర్ స్టేషన్‌కు సమాచార ఇచ్చారు. సమయానికి ఫైర్ ఇంజిన్ సంఘటన స్థలాన్ని చేరుకుని మంటలను అదుపులోకి తీసుక వచ్చారు. ఈ సందర్భంగా డ్రైవర్ మాట్లాడుతూ సమయానికి ఫైర్ ఇంజిన్ రాకపోయి ఉంటే లారీ మొత్తం కాలి బూడిద అయ్యేదని, అగ్నిమాపక సిబ్బంది చాకచక్యంగా మంటలను అదుపులోకి తీసుకవచ్చారని తెలిపారు.

## వృద్ధుడు ఆత్మహత్య

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

ఒంటరితనాన్ని భరించలేని వృద్ధుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం మదనపల్లె పట్టణంలో ఆదివారం జరిగింది. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, దేవళం వీధి సమీపంలోని ఉమ్మర్ మసీదు వీధికి చెందిన సయ్యద్ జాఫర్ హుస్సేన్ (70) కి భార్య ఫామిద, ముగ్గురు కుమారులు జాకీర్ హుస్సేన్, షాకీర్ హుస్సేన్ జావిద్ హుస్సేన్ ఉన్నారు. ముగ్గురు కుమారులు వ్యాపార రిత్యా ముంబైలో స్థిరపడ్డారు. భార్య ఫామీద కూడా కుమారుల వద్దకే వెళ్లిపోవడంతో సయ్యద్ జాకీర్ హుస్సేన్ ఒంటరయ్యాడు. ఒంటరితనాన్ని జీర్ణించుకోలేక గత మూడు రోజులుగా తీవ్రంగా మదన పడుతున్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది. వారం రోజుల క్రితం కుమారుల వద్ద నుంచి భార్య ఫామీద మదనపల్లెకు వచ్చింది. అ భర్తతో ఉండకుండా పుట్టినిల్లు అయిన పోతబోలుకు వెళ్ళింది. ఈ క్రమంలో రాత్రి తీవ్ర మనస్థాపానికి గురైన జాకీర్ హుస్సేన్ తెల్లవారుజామునే తన ఇంటి ముందటే తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారుజామున ఉరికి వేలాడుతున్న మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఒకటో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకి దింపి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.